సాక్షి
శ్రీకాకుళం
మంగళవారం ◦ 19 ◦ మార్చి ◦ 2024




నిరుద్యోగులకు బాసట

స్కిల్‌హబ్‌లు నిరుద్యోగులకు బాసట చూపుతున్నాయి. జిల్లాలో 8 కేంద్రాలు ఉన్నాయి. - 8లో



ఇరిగేషన్ కార్యాలయంలో..

ఇరిగేషన్ కార్యాలయానికి రెగ్యులర్ పోస్టులు మంజూరయ్యాయి. ఈ మేరకు ఉత్తర్వులు కూడా వచ్చేశాయి. - 8లో



న్యూస్‌రీల్

వాక్ ఇన్ ఇంటర్వ్యూలు వాయిదా

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో 16 విభాగాల్లో 25 కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు నియామకానికి ఈ నెల 15వ తేదీన నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ మేరకు ఈ నెల 21న ఇంటర్వ్యూలు జరగాల్సి ఉండగా, వాయిదా వేసినట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 16న ఎన్నికల నోటిఫికేషన్ వచ్చింది. నోటిఫికేషన్ ముందు ప్రకటన ఇచ్చిన ఇంటర్వ్యూలు నిర్వహించాలని అధికారులు బావించారు. అయితే ఇంటర్వ్యూల నిర్వహణకు, ఎంపిక జాబితా ప్రకటనకు ఎన్నికలు నియమావళి అడ్డు వచ్చే అవకాశం ఉండటంతో అధికారులు వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల నియమావళి ముగిశాక నియామకాలు ఉంటాయని అధికారులు తెలిపారు.

రైలు ప్రయాణికులపై తేనెటీగల దాడి



తేనెటీగల దాడికి గురై చికిత్స పొందుతున్న ప్రయాణికులు

మందస: మండలంలోని మందస రైల్వేస్టేషన్‌లో సోమవారం తేనెటీగల దాడిలో దాదాపు 75 మందికి గాయాలయ్యాయి. మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంట వరకు ఈ దాడి కొనసాగింది. రైలు వచ్చి ప్రయాణికులు దిగే సమయానికి స్టేషన్‌లో ఉన్న చెట్లకు ఉన్న తేనె పట్టుల నుంచి తేనెటీగలు బయటకు వచ్చి అందరిపై దాడి చేశాయి. దీంతో బాధితులంతా హరిపురం, పలాస ఆస్పత్రులకు వివిధ వాహనాల్లో తరలి వెళ్లారు. బాధితుల సంఖ్య 100 మంది వరకు ఉంటుందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు ఎం.జోగినాయుడు, పి.జ్ఞానేశ్వరి, టి.షణ్ముఖరాజ్ వైద్య సేవలు అందించారు. వీరిని అబ్జర్వేషన్‌లో ఉంచినట్టు తెలిపారు. మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఎన్నడూలేని విధంగా తేనెటీగలు దాడి చేయడంతో రైల్వేస్టేషన్‌లో ఉన్న తేనె పట్టులను రైల్వే అధికారులు తొలగించాలని కోరుతున్నారు.

నవ దంపతులకు దుస్తుల అందజేత



నవ వధూవరులకు దుస్తులు అందిస్తున్న సర్పంచ్, గ్రామ పెద్దలు

వజ్రపుకొత్తూరు రూరల్: నువ్వలరేవులో ఈ నెల 16న జరిగిన సామూహిక వివాహాల్లో 62 జంటలు ఒక్కటయ్యాయి. ఈ సందర్భంగా నవదంపతులకు సోమవారం బెహరాలతో కలిసి సర్పంచ్ ముర్వల కమల యజ్ఞా, ఉప సర్పంచ్ ముర్వల దేవ ఇంటింటికీ వెళ్లి చీర, పంచె అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు రామకృష్ణ, త్రినాథ్, మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు నీలాంబర్ తదితరులు ఉన్నారు.

● పార్టీలో సిగపట్లు

కూటమిలో సీటుపాట్లు

- టిక్కెట్ల కోసం టీడీపీలో గ్రూపుల గోల
- నాలుగు నియోజకవర్గాల్లో ప్రతిష్టంభన
- ఒకరికిస్తే మరొకరు సహకరించేది లేదంటూ హెచ్చరికలు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: టీడీపీలో సీటుముడి వీడడం లేదు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు అభ్యర్థులు ఖరారు కాకపోవడంతో నాయకుల్లో గందరగోళం చోటు చేసుకుంది. పొత్తులో క్లారిటీ లేకపోవడంతో కూటమిలో కుమ్ములాటలు తప్పడం లేదు. పార్టీలో ఉన్న గ్రూపుల నేపథ్యంలో పొత్తులో ఇచ్చేస్తే సరిపోద్దనే ఆలోచనలో చంద్రబాబు ఉన్నారు. ఈ నేపథ్యంలో ఏ నియోజకవర్గం ఏ పార్టీకి ఇస్తారన్నది సస్పెన్స్‌గా మారింది.

జిల్లాలోని పలాస, ఎచ్చెర్ల, పాతపట్నం, శ్రీకాకుళం నియోజకవర్గాలకు టీడీపీ అభ్యర్థుల్ని ఇప్పటి వరకు ఖరారు చేయలేదు. ఈ నాలుగు నియోజకవర్గాల్లో ఆ పార్టీలో గ్రూపులున్నాయి. ఎవరికిచ్చినా మిగతా గ్రూపు వ్యతిరేకించే పరిస్థితి ఉంది. వాళ్లలో వారే ఓడించుకునేలా కత్తులు దూసుకుంటున్నారు. పలాసలో గౌతు శిరీషకు చెక్ పెట్టాలని ఆ పార్టీ నాయకులే చూస్తున్నారు. బానిస బతుకు ఎన్నాళ్లని ఆ పార్టీ శ్రేణులు ఆవేదనతో ఉన్నాయి. నియంతృత్వ పోకడతో అణగదొక్కేస్తున్నారని అభిప్రాయంతో కీలక నాయకులు ఉన్నారు. పాతపట్నంలో కలమట వెంకటరమణ, మామిడి గోవిందరావు నువ్వానేనా అన్నట్టుగా ఉన్నారు. సిగపట్లు పడుతున్నారు. కలమటను ఎట్టి పరిస్థితుల్లో గెలవనిచ్చే పరిస్థితి లేదని మామిడి తొడ కొడుతున్నారు. మామిడికిస్తే పార్టీ దయనీయంగా ఉన్నట్టేనని, నాలుగు డబ్బులున్నాయని టిక్కెట్ ఇచ్చేస్తే ఎన్నికల్లో చుక్కలు చూపిస్తామని బాహాటంగానే కలమట వ్యాఖ్యానిస్తున్నారు. శ్రీకాకుళంలో పరిస్థితి చెప్పనక్కర్లేదు. గుండ లక్ష్మీదేవి, గొండు శంకర్ మధ్య యుద్ధమే జరుగుతోంది. లక్ష్మీదేవికిస్తే ఊరుకునేది లేదని గొండు శంకర్, ఈయనకిస్తే ఓడించి తీరుతామని గుండ లక్ష్మీదేవి శపథం చేస్తున్నారు. ఎచ్చెర్లలో కళా వెంకటరావు, కలిశెట్టి అప్పలనాయుడు మధ్య పోరు తీవ్రంగా నడుస్తోంది. సీనియర్‌నైన తనను అవమానపరుస్తున్నారని కళా ఆవేదనతో ఉన్నారు. ఆయన అనుచరులు కూడా రోడ్డెక్కి గొడవ చేస్తున్నారు. మరోవైపు కలిశెట్టి కూడా నమ్మకంతో ఉన్నారు. అధిష్టానం టిక్కెట్ ఇస్తుందన్న ధీమాతో ఉన్నారు. ఒకవేళ ఇవ్వకపోతే ఈసారి బరిలో ఉండటం ఖాయమని చెప్పకనే చెబుతున్నారు. మొత్తానికి నాలుగు నియోజకవర్గాల్లోనూ టిక్కెట్ ఎవరికిచ్చినా రెండో వర్గం వ్యతిరేకంగా పనిచేసే పరిస్థితి ఉంది. అసలే జనాల్లో పార్టీకి అంతగా బలం లేదు. ఆ పై వర్గపోరు.. ఉన్న కేడర్ కూడా చీలిపోవడంతో చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకుంది. ఈ నేపథ్యంలో ఇబ్బందికరంగా ఉన్న నియోజకవర్గాల్లో ఒకటో రెండో పొత్తులో భాగంగా ఇచ్చేయాలన్న ఆలోచనలో ఉన్నారు.

● పొత్తు పొడుపు..

పొత్తులో భాగంగా ఎచ్చెర్ల, శ్రీకాకుళం, పాతపట్నం నియోజకవర్గాలపై బీజేపీ కన్నేసింది. ఈ మూడింటిలో ఏదో ఒకటి కేటాయిస్తారని ధీమాతో ఉంది. ఎచ్చెర్లలో ఎన్ఈఆర్, పాతపట్నంలో ఇటీవల బీజేపీలో చేరిన తేజేశ్వరరావు, శ్రీకాకుళంలో పైడి వేణుగోపాల్, సురేంద్ర కుమార్ తదితరులు రేసులో ఉన్నారు. ఎవరికి వారు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. తమకు సన్నిహితంగా ఉన్న అధిష్టానం పెద్దలతో లాబీయింగ్ చేసుకుంటున్నారు. జనసేన విషయానికి వస్తే పాతపట్నం, ఎచ్చెర్ల, పలాసపై దృష్టి పెట్టింది. పార్టీకోసం తొలి నుంచి పనిచేస్తున్న పాతపట్నం నాయకుడు గేదెల చైతన్య, ఎచ్చెర్ల నాయకుడు విశ్వక్ సేన్ ఆశతో ఉన్నారు. మరోవైపు పలాస నుంచి పోటీ చేయాలని ఇటీవల ఆ పార్టీలో చేరిన డాక్టర్ దానేటి శ్రీధర్ ప్రయత్నిస్తున్నారు.

టీడీపీ, జనసేన, బీజేపీతో పొత్తుతో నాలుగు నియోజకవర్గాలపై ప్రతిష్టంభన నెలకుంది. అభ్యర్థిత్వాలు ఖరారు కాకపోవడంతో ఆశావహులు ముందుకెళ్లలేక, వెనక్కి తగ్గలేక సతమతమవుతున్నారు. పోటీ చేయకముందే టిక్కెట్ కోసమే కోట్లు ఖర్చు పెడుతున్న పరిస్థితి నెలకుంది. ఇంత చేసినా టిక్కెట్ వస్తుందో లేదో అన్న అనుమానం ఒకవైపు వెంటాడుతూనే ఉంది. చివరి నిమిషంలో చంద్రబాబు దెబ్బ వేసేస్తే తమ పరిస్థితేంటన్న ఆందోళనలో ఉన్నారు. గత ఐదేళ్లు పార్టీ కోసం కోట్లు ఖర్చు పెట్టాం.. ఇప్పుడేమో టిక్కెట్ కోసం వెంపర్లాడాల్సి వస్తోందని .. తమకిదేమి పరిస్థితి అని ఆవేదన చెందుతున్నారు. పొత్తు కలిసిరాకపోగా కష్టపడి పనిచేసినోళ్లని రోడ్డున పడేసే పరిస్థితి దాపురించిందని వారంతా గగ్గోలు పడుతున్నారు. పొత్తులో భాగంగా సీట్లు కేటాయిస్తే తమ దారి తాము చూసుకోకతప్పదని కూడా హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఒకవేళ టీడీపీ అభ్యర్థులే నాలుగు నియోజకవర్గాల్లో బరిలో ఉంటే తామెందుకు పనిచేస్తామనే ధోరణిలో జనసేన, బీజేపీ నాయకులు ఉన్నారు.

పొలిటికల్ పాయింట్

ఎన్నికల విధులకు మాజీ సైనికులు: ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్ : రానున్న సార్వత్రిక ఎన్నికల విధుల్లో స్వచ్ఛందంగా పాల్గొనేందుకు మాజీ సైనికులు ముందుకు రావాలని ఎస్పీ జీఆర్ రాధిక పిలుపునిచ్చారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాసైనిక్ బోర్డులో సభ్యత్వమున్న మాజీ సైనికులతో ఎన్నికల విధులపై ఎస్పీ సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు ఆసక్తి గల, ఉత్సాహవంతులైన 60 ఏళ్లలోపు మాజీ సైనికులు వ్యక్తిగత వివరాలతో ఈనెల 25లోగా జిల్లా సైనిక్ సంక్షేమ కార్యక్రమంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఆరోగ్యంగా, శారీరకంగా దృఢంగా ఉంటూ ఎలాంటి క్రిమినల్ కేసులు లేని సైనికులను విధుల్లోకి తీసుకుంటామని పేర్కొన్నారు. రెండురోజుల పాటు పోలింగ్‌కేంద్రాల వద్ద క్యూలైన్ క్రమబద్ధీకరణ విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రేమ్ కాజల్, జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఎ.శైలజ, స్పెషల్ బ్రాంచి డీఎస్పీ త్రినాధరావు, జిల్లా మాజీ సైనికుల సమాఖ్య అధ్యక్షులు పూర్ణచంద్ర, పి.ఈశ్వరరావు, మాజీ సైనికులు పాల్గొన్నారు.



మాజీ సైనికులతో ఎస్పీ జీఆర్ రాధిక

కంట్రోల్ రూమ్ పరిశీలన

శ్రీకాకుళం పాతబస్టాండ్: కొత్త కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ సోమవారం సందర్శించారు. ప్రతి విభాగంలో ఎవరెవరు ఏం చేస్తున్నారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు, జీపీఎస్ వాహనాలు హాజరైన సమయాలను వెళ్లిన రూట్లను, తదితర వాటిని పరిశీలించి పలు సూచనలు జారీ చేశారు. కంట్రోల్ రూమ్ సందర్శనలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, డీఆర్‌ఓ ఎం. గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

లైసెన్సు తుపాకీలు స్వాధీనం: కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున లైసెన్స్ ఉన్న తుపాకులను వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో డిపాజిట్ చేయించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. కలెక్టర్, ఎస్పీ జీఆర్ రాధికలతో కూడిన స్క్రీనింగ్ కమిటీ సోమవారం సమావేశమై లైసెన్స్‌డ్ ఆయుధాలపై సమీక్షించారు. బ్యాంకుల్లో పనిచేసే సెక్యూరిటీ గార్డులు, ఏటీఎం కేంద్రాలకు డబ్బులు తీసుకువెళ్లే సెక్యూరిటీ ఏజెన్సీలు, క్రీడా ఈవెంట్‌ల వారు తప్ప మిగతా వ్యక్తులు తమ ఆయుధాలు డిపాజిట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వాటిని డిపాజిట్ చేయక పోయినా, అక్రమంగా కలిగి ఉన్నా.. వారిపై ఎలక్షన్ కమిషన్ ఆదేశానుసారం తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 254 లైసెన్సులకు గాను వివిధ రకాల 273 తుపాకులు ఉన్నాయని వాటిలో బ్యాంకు సెక్యూరిటీ గార్డుల వద్ద 47, క్యాష్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ వద్ద ఉన్న 28 తుపాకులకు మినహాయింపు ఇచ్చామని తెలిపారు.

అధికారులు.. బాధ్యతలు



శ్రీకాకుళం పాత బస్టాండ్, నరసన్నపేట: సార్వత్రిక ఎన్నికల వేడి మొదలైపోయింది. ఇప్పటికే అధికారులు ఎన్నికల పనుల్లో బిజీ అయిపోయారు. ఈ ఎన్నికల నిర్వహణలో జిల్లా ఎన్నికల అధికారి నుంచి పోలింగ్ స్థాయి అధికారి (బీఎల్‌ఓ) వరకూ అందరూ కీలకమే. నామినేషన్ల స్వీకరణ నుంచి ఫలితాలు వెల్లడించే వరకూ ప్రతి విషయంలో అధికారుల పాత్ర ఉంటుంది. ఎవరెవరి బాధ్యతలు ఏమిటో చూస్తే..



ప్రధాన ఎన్నికల అధికారి : రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణ, పర్యవేక్షణకు కేంద్ర ఎన్నికల సంఘం సంబంధిత రాష్ట్రాన్ని సంప్రదించి ప్రధాన ఎన్నికల అధికారిని నియమిస్తుంది. రాష్ట్రంలో ఎన్నికలను సమర్థంగా నిర్వహించేందుకు అవసరమైన నిర్ణయాలు తీసుకునే అధికారం ప్రధాన ఎన్నికల అధికారికి ఉంటుంది.

జిల్లా ఎన్నికల అధికారి : ఏ జిల్లా కలెక్టర్ అక్కడ జిల్లా ప్రధాన ఎన్నికల అధికారిగా ఉంటారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలు చేస్తూ.. ఎన్నికలు ప్రశాంతంగా జరిపించడంలో కీలక పాత్ర పోషిస్తారు.



రిటర్నింగ్ అధికారి(ఆర్‌ఓ) : శాసనసభ ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రతి నియోజకవర్గానికీ ఒక రిటర్నింగ్ అధికారి ఉంటారు. వీరు నియోజకవర్గంలో నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు, అభ్యర్థుల తుది జాబితా తయారు చేస్తారు. పోలింగ్ కేంద్రంలో విధులు నిర్వహించే సిబ్బంది నియామకాలు, వారికి శిక్షణ, ఓట్లు లెక్కింపు, ఫలితాల ప్రకటన వంటి విధులను ఆర్‌ఓ నిర్వహిస్తారు.

ఏఆర్‌ఓ.. : నియోజకవర్గ స్థాయిలో ఆర్‌ఓకు సహాయకారిగా స్థానిక తహసీల్దార్లు ఏఆర్‌ఓలుగా వ్యవహరిస్తారు. ఆర్‌ఓ చేపట్టే బాధ్యతలను వీరు పంచుకుంటారు. ఆర్‌ఓకి అన్ని విధాలా సహాయం చేస్తూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహణకు తోడ్పతారు.



ప్రిసైడింగ్ అధికారి : ప్రతి పోలింగ్ బూత్‌కు ఒక ప్రిసైడింగ్ అధికారి ఉంటారు. ఆయన పోలింగ్‌కు అవసరమైన ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను బూత్‌కు తీసుకువస్తారు. పోలింగ్ అనంతరం సీల్ వేసి స్ట్రాంగ్‌రూంకు తరలిస్తారు. ఇతనికి మరో అధికారి ఏపీఓ ఉంటారు. పోలింగ్ కేంద్రాల్లో జరిగే అన్ని కార్యకలాపాలు ఈయన పర్యవేక్షణలోనే జరుగుతాయి.



సెక్టోరల్ అధికారి : ఎనిమిది నుంచి పది పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించేందుకు ఒక్కో సెక్టోరల్ అధికారిని నియమిస్తారు. మండలంలో వివిధ శాఖల్లో పనిచేసే గెజిడెట్ అధికారులు ఈ బాధ్యతలు చూసుకుంటారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చోట 144 సెక్షన్ విధించే అధికారం సెక్టోరల్ అధికారికి ఉంటుంది. సమస్యాత్మక గ్రామాలు, పోలింగ్ బూత్‌ల గురించి అక్కడ బందోబస్తుకు సిఫారసు చేయడం వంటి విధులు నిర్వహిస్తారు.



ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు : నియోజకవర్గానికి ఒకటి లేదా రెండు చొప్పున ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఉంటాయి. వీరు ఆయా మండలాల్లో మద్యం, డబ్బు, ఓటర్లను ప్రలోభ పరిచేందుకు తరలించే సామగ్రి అక్రమ రవాణా జరగకుండా తనిఖీలు నిర్వహిస్తారు.

మైక్రో అబ్జర్వర్లు : ఎన్నికలు జరిగే తీరును నివేదిక రూపొందించి జిల్లా రాష్ట్ర ఎన్నికల అధికారులకు పంపడంలో మైక్రో అబ్జర్వర్లు కీలకంగా వ్యవహరిస్తారు.



బీఎల్‌ఓలు.. : కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారికి దరఖాస్తులను అందజేయడం, ఓటర్లను తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చూడడం బీఎల్‌ఓల బాధ్యత. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల గురించి ఉన్నతాధికారులకు తెలియజేయడం, ఓటరు జాబితా ప్రదర్శన, పోలింగ్ కేంద్రాల మార్పు తదితర సేవలను అందిస్తారు.

ఓటరు నమోదు అధికారి: ఓటర్ల జాబితాను తయారు చేయడం ఈ అధికారి బాధ్యత. ఓటు నమోదు చేసుకొనే వారు, జాబితాలో పేర్లు తప్పుగా ఉన్న వారు ఈ అధికారిని సంప్రదిస్తే తగిన చర్యలు తీసుకుంటారు. వీరి పర్యవేక్షణలో కొందరు సిబ్బంది పనిచేస్తారు.

2024 సమరం సన్నద్ధం

● 'నిబంధనలు పాటించాల్సిందే'


ఎచ్చెర్ల క్యాంపస్: ఎన్నికల నియమావళి తప్పనిసరిగా పాటించాలని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి.సుబ్బారావు అన్నారు. ఎచ్చెర్లలోని ఏపీ బేవరేజెస్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో సోమవారం ఎన్నికలు నియమావళిపై సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రతిఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నా రు. ప్రతిరోజూ జిల్లా యూనిట్‌గా బి–12 ఫామ్ ద్వారా మద్యం అమ్మకాల వివరాలు కలెక్టర్‌కు అందజేయాల్సి ఉంటుందన్నారు. బార్లు, వైన్ షాపులు వంటి చోట్ల ఎన్నికల ప్రచారం, నాయకులు ఫొటోల ప్రదర్శన, సిబ్బంది ప్రచారంలో పాల్గొనటం నిషేధమన్నారు. షాపులు, బార్ల వద్ద సీసీ కెమెరాలు పెట్టాలని సూచించారు. రి కార్డుల నిర్వహణ, అమ్మకం వివరాలు, స్టాక్ పక్కాగా ఉండాలన్నారు. నిబంధనల మేరకు ఉదయం 11 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే మద్యం దుకాణాలు తెరిచి ఉంటాయని పేర్కొన్నారు. ఒక వ్యక్తికి మూడుకు మించి బాటిళ్లు విక్రయిస్తే ఎన్నికల నియమావళి అతిక్రమణ కిందకు వస్తుందన్నారు. వినియోగదారులు నిబంధనలు అతిక్రమిస్తే కంట్రోల్ రూ మ్ నంబర్ 7989343418కు చెప్పాలని సూచించారు. మద్యం విక్రయాల నిబంధనల పరిశీలనలో 44 మంది పోలీసులు, ఐదుగురు ఎస్సైలు, ఇద్దరు సీఐలు, ఏఈఎస్, ఈఎస్‌ఐ పనిచేస్తున్నారన్నారు.



సూచనలిస్తున్న జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సుబ్బారావు

● సాంకేతిక హంగులతో..

హిరమండలం: కొత్త ఓటరు కార్డులు సాంకేతిక హంగులతో సిద్ధమయ్యాయి. ఈ కార్డుల్లో క్యూఆర్ కోడ్ కూడా ఉంది. పది అంకెల ప్రామాణిక సిరీస్‌తో వచ్చాయి. వీటిని తపాలా శాఖ రిజిస్టర్ పోస్ట్ ద్వారా ఓటర్లకు పంపిణీ చేస్తోంది.



క్యూఆర్‌కోడ్‌తో కొత్త ఓటరు కార్డు

● ఫ్లాగ్‌మార్చ్‌లో కలెక్టర్..



టెక్కలిలో ప్రత్యేక బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, సహాయ కలెక్టర్ రాఘువేంద్ర మీనా

టెక్కలి: ఎన్నికల షెడ్యూల్ ప్రకటన నేపథ్యంలో ప్రశాంత ఎన్నికల కోసం అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా సోమవారం టెక్కలిలో కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తో పాటు ప్రత్యేక బలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాయి. ముందుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ప్రత్యేక బలగాలతో కలెక్టర్ చర్చించారు. అనంతరం టెక్కలి పోలీస్ స్టేషన్ నుంచి పాత జాతీయ రహదారి మీదుగా అంబేడ్కర్ జంక్షన్ వరకు మార్చ్‌పాస్ట్ నిర్వహించారు. అనంతరం రావివలస వద్ద ఏర్పాటు చేయనున్న చెక్‌పోస్టును పరిశీలించారు.

పది.. మొదలైంది





శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధాన ద్వారం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు

పరీక్ష కేంద్రానికి నడిచివెళ్తున్న ఓ విద్యార్థిని

- ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు ప్రారంభం
- తొలిరోజు 458 మంది గైర్హాజరు
- సి–కేటగిరీలో ఉన్న 62 కేంద్రాలపై ప్రత్యేకంగా ఫోకస్

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 145 పరీక్ష కేంద్రాల్లో ఉదయం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు విద్యార్థులు పరీక్ష రాశారు. తొలి రోజు ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్‌కు జిల్లా వ్యాప్తంగా 29,243 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 28,785 మంది పరీక్ష రాశారు. వివిధ కారణాలతో 458 మంది గైర్హాజరయ్యారు. తొలి రోజు ఎలాంటి మాల్‌ప్రాక్టీసులు నమోదుకాలేదని అధికారులు స్పష్టంచేశారు.

పరీక్ష కేంద్రాల వద్ద పక్కాగా 144 సెక్షన్..

పదో తరగతి పరీక్షల్లో పోలీసులు 144 సెక్షన్‌ను పకడ్బందీగా అమలు చేశారు. విద్యార్థులను సైతం కేంద్రాల్లోకి ప్రవేశించేటప్పుడు నిశితంగా పరిశీలించారు. తల్లిదండ్రులతో సహా ఇతరులను ఎవరినీ కేంద్రాల్లోకి అనుమతించలేదు. అలాగే పరీక్ష కేంద్రాలకు నియమించిన చీఫ్ సూపరింటెండెంట్లతో సహా డీఓలు, కస్టోడియన్లు, ఇన్విజిలేటర్లు, స్క్వాడ్‌లు, తనిఖీ బృందాలు, మెడికల్ సిబ్బంది ఫోన్లు సైతం పరీక్ష కేంద్రాల్లోపలకు అనుమతించలేదు. జిల్లాలో చాలా చోట్ల విద్యార్థులు తమ హాల్‌టిక్కెట్లను చూపించి ఆర్టీసీ బస్సుల్లో కేంద్రాలకు చేరుకున్నారు.



ఇచ్ఛాపురం రూరల్: స్క్రైబ్ సహాయంతో ఈదుపురంలో పరీక్ష రాస్తున్న అంధ విద్యార్థి రాఖీ

విస్తృతంగా తనిఖీలు..

ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ శ్రీకాకుళం నగరంలోని అరసవల్లి రోడ్‌లో ఉన్న కేశవరెడ్డి పాఠశాలను సందర్శించారు. ఫర్నీచర్ ఏర్పాట్లు, తాగునీరు, ఇతర వసతులను పరిశీలించారు. అలాగే ఎస్పీ జీఆర్ రాధిక, ఏఎస్పీ జి.ప్రేమ్‌కాజల్ శ్రీకాకుళంలోని భాష్యం, గీతాంజలి పలు కేంద్రాలను సందర్శించారు. పోలీసులకు పలు సూచనలుచేసి, దిశానిర్దేశం చేశారు. జిల్లా పరిశీలకులు ఎస్‌డీ వెంకటరమణ పలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే డీఈఓ కె.వెంకటేశ్వరరావు శ్రీకాకుళం న్యూసెంట్రల్ స్కూల్‌తోపాటు మరో మూడు కేంద్రాలను తనిఖీ చేశారు. సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ లియాఖత్ ఆలీఖాన్ పలు కేంద్రాలను పరిశీలించారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, సిట్టింగ్ స్క్వాడ్లు, డీవైఈఓలు, ఇతర అధికారులు మొత్తం 57 కేంద్రాలను తనిఖీ చేశారు. కాగా సి–సెంటర్లుగా ఉన్న 62 కేంద్రాలపై అధికారులు ప్రత్యేకంగా ఫోకస్ చేశారు. ప్రభుత్వం, అధికారులు విస్తృతంగా ప్రచారం చేయడంతో విద్యార్థులు నిర్దేశిత సమయానికి అర్ధగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు.

క్లుప్తంగా

అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా 'చింతాడ'



చింతాడ సత్యనారాయణ

శ్రీకాకుళం పాత బస్టాండ్: రెండో అదనపు జిల్లా, సెషన్స్ కమ్ మహిళా కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ లాయర్ చింతాడ సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు విజయవాడ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయనకు ఈ పదవి రావడంపై జిల్లా బార్ అసోసియేషన్‌లో పలువులు లాయర్లు హర్షం వ్యక్తం చేశారు.

'బార్'లో ఎన్నికల వేడి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా న్యాయవాదుల బార్ అసోసియేషన్‌కు ఎన్నికలు జరగనున్నాయి. ఈ నెలలో ఎన్నికలు ఉంటాయని నోటిఫికేషన్ విడుదలైంది. 18, 19 తేదీల్లో నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈ నెల 21న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. 22న విత్‌డ్రాకు అవకాశమిచ్చారు. తుదిజాబితా 23న ప్రకటించి, 27న పోలింగ్ నిర్వహించనున్నారు. 27న కౌంటింగ్ నిర్వహించి విజేతలను ప్రకటిస్తారు.

'వీఎల్‌టీ సమస్యను పరిష్కరించాలి'

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ చెల్లించడం ప్రధాన సమస్యగా మారిందని, వీఎల్‌టీల లాగిన్ అయ్యేలా చూడాలని జిల్లాలోని ఎల్‌టీపీలు అందరూ వెల్ఫేర్ అసోసియేషన్ లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్‌కుమార్, చైర్మన్ మురళీకృష్ణలను కోరారు. లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కేఎస్ ఎస్‌వీ ప్రసాద్ (హారికా ప్రసాద్) అధ్యక్షతన హారికా కన్‌స్ట్రక్షన్స్ కార్యాలయంలో డబ్ల్యూఏఎల్‌టీపీ రాష్ట్ర అసోసియేషన్‌తో సోమవారం సమావేశం నిర్వహించారు. సమావేశానికి నగరంలోని ఎల్‌టీపీలందరూ హాజరై రాష్ట్ర అసోసియేషన్ ప్రతినిధుల దృష్టికి తమ సమస్యలను తీసుకువెళ్లారు. దానికి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌కుమార్ స్పందిస్తూ ఇది ప్రస్తుతం ప్రాసెస్‌లో ఉందని త్వరలోనే లాగిన్ అయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. టీడీఆర్ ఫేక్‌బాండ్లు, రెండు అసోసియేషన్ల సమస్యను ప్రస్తావించగా.. రాష్ట్ర ప్రతినిధులు స్పందిస్తూ రెండు అసోసియేషన్లతో చర్చించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

24న జిల్లాస్థాయి బలప్రదర్శన పోటీలు

సారవకోట: మండలంలోని వడ్డినవలస గ్రామంలో ఈ నెల 24న జిల్లాస్థాయి బలప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఇప్పిలి ఆంజనేయ ప్రసాద్ తెలిపారు. గ్రామంలో గల శ్రీ త్రినాథ స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఇప్పిలి గణపతిరావు మాస్టారు జ్ఞాపకార్థం బంపరు, సంగిడి, విసురుగుండు, తీత సంగిడి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వీటిలో విజేతలకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 23లోగా 9502382777 నంబర్‌కు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

రక్తదానంతో గర్భిణికి ప్రాణదానం



రక్తదానం చేస్తున్న అవినాష్

కాశీబుగ్గ: ప్రసూతి సమయంలో రక్తలేమితో ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిండు గర్భిణికి రక్తదానం చేసి ఓ యువకుడు కాపాడాడు. వివరాల్లోకి వెళ్తే వజ్రపుకొత్తూరు మండలం అనంతగిరి కాలనీకి చెందిన మోహిని ప్రసవం కోసం టెక్కలి ప్రభుత్వాస్పత్రిలో చేరింది. రక్తలేమితో ఇబ్బందికర పరిస్థితికి చేరుకోవడంతో సమస్యను నవతరం సేవా సంఘం తరఫున తెలుసుకున్న పలాస మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన అవినాష్ నేరుగా బి-నెగిటివ్ రక్తాన్ని అందించి ఆదుకున్నారు. ఆయనకు కుటుంబ సభ్యులు, బంధువులు, ఆస్పత్రి వర్గాల వారు కృతజ్ఞతలు తెలిపారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా విజయలక్ష్మీబాయి



ఆమదాలవలస: ఆమదాలవలస సివిల్ జడ్జి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా సీనియర్ న్యాయవాది కణితి విజయలక్ష్మీబాయి ఎన్నికయ్యా రు. వరుసగా మూడుసార్లు అసోసియేషన్ అధ్యక్షురాలిగా పదవిని దక్కించుకున్నట్లు ఆ మె తెలిపారు. రెండుసార్లు ఏకగ్రీవంగా, ఒక సారి ఎన్నికల్లో పదవిని దక్కించుకున్నారు. మ హిళా న్యాయవాది బార్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా రాష్ట్ర వ్యాప్తంగా ఒక్క ఆమదాలవలసలోనే ఉన్నట్లు ఆమె తెలిపారు. సోమవారం బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది సాదు ధనుంజయరావు వ్యవహించారు. ఒకే నామినేషన్ దాఖలు కావడంతో ఆమెను న్యా యవాదులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా జోల రమ ణమూర్తి, కార్యదర్శిగా అల్లాడ విజయ్‌కుమా ర్, సహాయ కార్యదర్శిగా బొడ్డేపల్లి మోహనరావును ఎన్నుకున్నారు.

నిరుద్యోగ యువతకు బాసట

- ఉపాధినిస్తున్న స్కిల్‌హబ్ సెంటర్లు
- బహుళ జాతి కంపెనీల్లో 454 మందికి ఉపాధి
- జిల్లాలో 1537 మందికి శిక్షణ



నరసన్నపేట స్కిల్ హబ్ కేంద్రంలో శిక్షణపొందుతున్న నిరుద్యోగ యువత

నరసన్నపేట: స్కిల్ హబ్ సెంటర్లు నిరుద్యోగ యువతకు బంగారు బాటను చూపిస్తున్నాయి. ఉన్నత చదువులతో పాటు టెన్త్ నుంచి డిగ్రీ, పీజీ చేసి ఉద్యోగాన్వేషణలో విసిగి వేసారిన గ్రామీణ యువతకు ఈ స్కిల్ హబ్ కేంద్రాలు చుక్కానిలా నిలిచాయి. నరసన్నపేటతో పాటు మిగిలిన 7 నియోజకవర్గ కేంద్రాల్లో స్కిల్ హబ్ కేంద్రాలు నిర్వహిస్తున్నారు.

454 మందికి ప్లేస్‌మెంట్లు

జిల్లాలో గత ఏడాది ఫిబ్రవరి 16 నుంచి స్కిల్ హబ్ కేంద్రాలు నడుస్తున్నాయి. ఇప్పటి వరకూ 1537 మంది నిరుద్యోగ యువత శిక్షణ పొందగా 885 మంది వివిధ రంగాల్లో అసెస్‌మెంట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. వీరిలో 454 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. వీరు విశాఖపట్నంతో పాటు ఇతర పట్టణాల్లో పలు కంపెనీల్లో పనిచేస్తున్నారు. ఒక్కొక్కరూ నెలకు రూ. 12 వేల నుంచి రూ. 30 వేల వరకూ జీతం తీసుకుంటున్నారని నైపుణ్యాభివృద్ధి అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం 8 కేంద్రాల్లో 380 మంది శిక్షణ పొందుతున్నారు.

10 కేటగిరీల్లో శిక్షణ..

స్కిల్ హబ్ కేంద్రాల్లో ప్రస్తుతం 10 కేటగిరీల్లో యువతకు శిక్షణ ఇస్తున్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్, ఫ్రంట్ ఆఫీస్ అసిస్టెంట్స్, బీపీఓ, సేవింగ్ మిషన్ ఆపరేటర్, అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్స్, ఫిట్టర్ ఫేబ్రికేషన్, ఫోర్ వీలర్స్ టెక్నిక్స్‌తో పాటు మరో మూడు కేటగిరీల్లో శిక్షణ లభిస్తోంది.

మారీటెక్‌లో పనిచేస్తున్నా..



నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ కేంద్రంలో 3 నెలలు శిక్షణ ఉచితంగా పొందాను. కొద్ది రోజులకే జిల్లా కేంద్రంలో జాబ్‌మేళా నిర్వహిస్తే హాజరయ్యాను. నన్ను సెలెక్ట్ చేశారు. నెల్లూరులో మారీటెక్ కంపెనీలో పనిచేస్తున్నా.. ఉద్యోగంలో చేరి సంవత్సరం అవుతుంది. చాలా ఆనందంగా ఉంది. నాన్న మరణిస్తే అమ్మ అంతా తానై చదివించారు. ఇప్పుడు జగనన్న దయ వల్ల ఉద్యోగం పొంది కుటుంబానికి అండగా ఉంటున్నా.

– పాతపూడి పూర్ణిమ, నెయ్యిల వీధి, నరసన్నపేట

ఉద్యోగం పొందాను



మాది బీద కుటుంబం. డిగ్రీ వరకూ చదువుకున్నా. తర్వాత స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ద్వారా నిర్వహిస్తున్న స్కిల్ హబ్ కేంద్రంలో కంప్యూటర్‌లో శిక్షణలో చేరాను. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణ తీసుకున్నా, ఉద్యోగం కూడా వచ్చింది. ఆనందంగా ఉంది.

– డి.లక్ష్మినారాయణ, యారబాడు ఐ కాలనీ, నరసన్నపేట

ఎస్‌బీఐ టెలీ కాలింగ్‌లో జాబ్ చేస్తున్నా



నేను ఉద్యోగం చేస్తానని అనుకోలేదు. శ్రీకాకుళం స్కిల్ హబ్ సెంటర్‌లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ గా ట్రైనింగ్ పొందాను. కొద్ది రోజులకే ఎస్‌బీఐ టెలీ కాలింగ్‌లో ఉద్యోగ అవకాశం వచ్చింది. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులకు, ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.

– పి.జయశ్రీ, లింగాలవలస, జలుమూరు మండలం

ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయంలో రెగ్యులర్ పోస్టులు

పోస్టుల వివరాలు ఇలా..	
అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు	2
ఏటీఓ అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్	1
జూనియర్ టెక్నికల్ ఆఫీసర్	4
టెక్నికల్ అసిస్టెంట్స్	1
సీనియర్ అసిస్టెంట్స్	4
టైపిస్ట్	2
జూనియర్ అసిస్టెంట్స్	6
ఆఫీస్‌సబార్డినేట్స్	4
ఆఫీస్ సబార్డినేట్స్	5



ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయానికి రెగ్యులర్ పోస్టులు మంజూరయ్యాయి. కార్యాలయం 2017 లోనే ఏర్పాటు చేసినా రెగ్యులర్ పోస్టులు ఇవ్వక ఇప్పటివరకు ఇన్‌చార్జులతోనే నెట్టుకొచ్చారు. దీంతో ప్రతి పనికి బొబ్బిలిలోగల ఇరిగేషన్ డివిజన్‌కి పరుగు పెట్టాల్సి వచ్చేది. రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చొరవ చూపి ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయంలో రెగ్యులర్ పోస్టులను శాంక్షన్ చేయించారు. ఈమేరకు ఈనెల 16న ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆ శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇరిగేషన్ సర్కిల్‌లో కొత్తగా మొత్తం 29 పోస్టులు మంజూరు చేస్తూ జీఓ నంబర్ 30ని విడుదల చేశారు. దీంతో ఆ శాఖలో ఇంజినీర్లంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రతి పనికి బొబ్బిలి పరిగెత్తే పరిస్థితి నుంచి విముక్తి కలిగిందని, వ్యయప్రయాసలు తగ్గాయని ఇంజినీర్లంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పోస్టుల మంజూరుకు కృషి చేసిన మంత్రి ధర్మానకు వంశధార ఎస్ఈ తిరుమలరావు, ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ పొన్నాడ సుధాకర్, ఈఈలు, డీఈలు, ఏఈలు, జేఈలతోపాటు ఇంజినీర్లంతా కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



బల్లిపుట్టుగలో వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న పిరియా విజయ, పిరియా సాయిరాజ్

కవిటి, కంచిలి: కంచిలి మండలంలోని గొల్లకంచిలి గ్రామానికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు సోమవారం బల్లిపుట్టుగ గ్రామంలో ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామానికి చెందిన కరగాన నీలయ్య, కరగాన లోకేష్, కరగాన రాఖేష్, కరగాన ముక్కాయ తదితరులు పార్టీలో చేరారు. వారికి పిరియా సాయిరాజ్ దంపతులు కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ ఐదేళ్ల పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించిన సంక్షేమాన్ని చూసి పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కంచిలి ఎంపీపీ పైలదేవదాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ ప్రారంభం

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ స్పాట్ వాల్యుయేషన్ మొదలైంది. శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల వేదికగా నాలుగు విడతల్లో జరగనున్న ఈ స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియలో భాగంగా సోమవారం మొదటివిడత ప్రారంభమైంది. అయితే మొదటి విడతలో తెలుగు, హిందీ, ఇంగ్లీషు, మాథ్స్, సివిక్స్ పేపర్ల వాల్యుయేషన్ మొదలుకావాల్సి ఉండగా.. ఆయా సబ్జెక్టుల బోర్డుల ఏర్పాటు పూర్తికావడం ఆలస్యం కావడంతో దిద్దుబాటు ప్రక్రియ మంగళవారం నుంచి షురూ చేయనున్నారు. మధ్యాహ్నం వరకు ఇంటర్మీడియెట్ బోర్డు ఉన్నతాధికారులు అన్ని జిల్లాల స్పాట్ క్యాంప్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, పలు సూచనలు చేశారు. ఆ సూచనలను జిల్లా స్పాట్‌కు హాజరైన సీఈలు, ఏఈలకు సబ్జెక్టులవారీగా తెలియజేయడం, అనంతరం స్కీమ్ ఆఫ్ వాల్యుయేషన్ అందజేయడం తదితర పక్రియలు పూర్తయ్యేసరికి సాయంత్రం కావడంతో తొలిరోజు దిద్దుబాటు ప్రక్రియను ప్రారంభించలేదు. మంగళవారం ఉదయం నుంచే జవాబుపత్రాల దిద్దుబాటును ప్రారంభిస్తామని ఆర్ఐఓ/జిల్లా స్పాట్ క్యాంప్ ఆఫీసర్ ప్రగడ దుర్గారావు పేర్కొన్నారు. జనరల్-1 గణపతి వెంకటేశ్వరరావు, జనరల్-2 పి.శివరాంప్రసాద్, సీసీవో జన్నెల సునీత, సీసీవో-2 బి.శ్యామ్‌సుందర్, కోడింగ్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

విధిగా రిపోర్ట్ చేయాలి: ఆర్ఐఓ

ఇంటర్మీడియెట్ బోర్డు అపాయింట్‌మెంట్ ఆర్డర్ వచ్చిన ప్రతి ఒక్కరూ స్పాట్ కేంద్రం వద్ద విధిగా రిపోర్ట్ చేయాలని ఆర్ఐఓ పి.దుర్గారావు స్పష్టం చేశారు.

కాలేజ్ లాగిన్‌లోని జ్ఞానభూమి వెబ్‌పోర్టల్ బీఐఈఏపీ సర్వీసెస్‌లో అపాయింట్‌మెంట్ ఆర్డర్ అందుకుని రిపోర్ట్ చేయని వారికి మెమోలు అందజేస్తామన్నారు. రోజుకు రూ.1000 చొప్పున ఫైన్ కూడా ఉంటుందన్నారు. స్పాట్ ఆర్డర్ వచ్చిన వారు రిపోర్ట్ చేయాల్సిందేనని ఆయన పేర్కొన్నారు.

'ఓపెన్ స్కూల్' పరీక్షలు ఆరంభం

శ్రీకాకుళం న్యూకాలనీ : జిల్లాలో సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ద్వారా పది, ఇంటర్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఓపెన్ స్కూల్ పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 4 కేంద్రాల్లో జరిగిన ఓపెన్ టెన్త్ పరీక్షలకు 644 మంది హాజరుకావాల్సి ఉండగా 85 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 7 కేంద్రాల్లో జరిగిన ఓపెన్ ఇంటర్ పరీక్షలకు 1351 మంది హాజరుకావాల్సి ఉండగా 125 మంది గైర్హాజరయ్యారు. 7 సిట్టింగ్, మరో 3 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు విస్తృతంగా తనిఖీ చేశాయి. ఈ పరీక్షలను డీఈఓ కె.వెంకటేశ్వరరావు, ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ లియాఖత్ ఆలీఖాన్, ఇతర అధికారులు పర్యవేక్షించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం రేపు

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ కొత్త భవనంలో బుధవారం ఉదయం 9.45కు ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు జిల్లా బార్ అసోసియేషన్ ఆపద్ధర్మ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. ఈ శిబిరం 'ఐ ఎక్స్‌ప్రెస్' డాక్టర్ ఎం.సుమన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారని తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని న్యాయవాదులు, గుమస్తాలు, కోర్టు సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి



లోకనాథం (ఫైల్)

టెక్కలి రూరల్: సంతబొమ్మాళి మండలం పెద్ద మర్రిపాడు గ్రామ సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో దేవనల్తాడ గ్రామానికి చెందిన తేరిపల్లి లోకనాథం(30) మృతిచెందాడు. ఈ మేరకు స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. లోకనాథం తన తమ్ముడు తాతయ్యతో కలిసి చిన్నమర్రిపాడు గ్రామంలో జరుగుతున్న ఎల్లమ్మ జాతరకు బైక్‌పై బయల్దేరాడు. పెద్ద మర్రిపాడు చెరువు మలుపు వద్ద ఎదురుగా వచ్చిన ఓ ఆటో లోకనాథం బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో ద్విచక్రవాహనం నడుపుతున్న లోకనాథం తలకు తీవ్ర గాయమైంది. దీంతో అతడిని పోలీసు వాహనంలో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి తల్లిదండ్రులు లేరు. అన్నదమ్ములు కలిసి ఉంటున్నారు. మృతుడి అన్న దేవనల్తాడ సర్పంచ్ వరదరాజు. ఈ ఘటనపై నౌపడ ఎస్ఐ కిశోర్ వర్మ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

20 కిలోల గంజాయితో ఒడిశా యువకుడు అరెస్టు



20 కిలోల గంజాయి మూటతో ఒడిశా యువకుడు కరడా కరుణా

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్ ఆవరణలో ఇరవై కిలోల గంజాయి తరలిస్తున్న ఒడిశా యువకుడిని సోమవారం సాయంత్రం పట్టుకున్నారు. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా ఆర్.ఉదయగిరి రెవెన్యూ బ్లాక్, చివిగడ పంచాయతీ రాజపురం గ్రామానికి చెందిన కరడా కరుణా బైక్‌పై గంజాయి తరలిస్తూ పలాస రైలు నిలయం ఎదురుగా పట్టుబడ్డాడు. రూ.ఇరవై వేలకు గంజాయి కొని చెన్నైకు తరలిస్తున్నాడని, రూ.లక్షకు బేరం కుదుర్చుకున్నాడని విచారణలో తేలింది. చెన్నై ఇటుకల పరిశ్రమలో వలస కార్మికుడిగా పనిచేస్తున్న కరుణాకు సైడ్ వ్యాపారంగా గంజాయి అమ్మకాలు సాగిస్తూ పలాస రైలు నిలయానికి వచ్చి వెళ్తుంటాడని పోలీసులు వెల్లడించాడు. ఎస్ఐ ఎం.వెంకటరావు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ కలంకూరి మధుబాబు, వీఆర్ఓ లోపింటి వెంకటరమణ, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు, పిసిలు ఈశ్వరరావు, నీలకంఠం, హెచ్‌సీ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనాలతో ఘనత



ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డులతో చిన్నారి పడాల పార్థివ్‌శ్రీవాత్సల్

ఇచ్ఛాపురం: పట్టణానికి చెందిన పడాల పార్థివ్ శ్రీవాత్సల్ అనే ఏడేళ్ల చిన్నారి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో రెండుసార్లు పేరు నమోదు చేసుకొని రికార్డు సృష్టించాడు. ఏఎస్‌పేట మున్సిపాలిటీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు గవర లక్ష్మి, లొద్దపుట్టి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల గణిత ఉపాధ్యాయుడు పి.అప్పలనాయుడు కుమారుడు పార్థివ్ శ్రీవాత్సల్ 1 నుంచి 100 వరకు గల ఘనాలు(క్యూబ్‌లు)ను 4 నిమిషాల 24 సెకండ్లలో రాసి తన పేరుని వరల్డ్ రికార్డులో రెండో సారి నమోదు చేసుకున్నాడు. ఇదే చిన్నారి గతంలో 1 నుంచి 50 వరకు క్యూబ్‌లను 1 నిమిషం 36 సెకండ్లలో రాసి మొదటిసారి ఈ రికార్డు సాధించాడు. రెండోసారి కూడా రికార్డు సాధించడంపై విద్యార్థి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

సైకత శుభాకాంక్షలు



పవిత్రమైన రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరులకు సైకత శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో గాజులకొల్లివలస గ్రామం సమీపంలో సంగమేశ్వర ఆలయం వద్ద సైకత శిల్పి గేదెల హరికృష్ణ వేసిన రంజాన్ సైకత శిల్పం ఆకట్టుకుంటుంది. – ఆమదాలవలస రూరల్

హత్య కేసులో నిందితుడు అరెస్ట్



నిందితుడు కూర్మారావు

మందస: మండలంలోని సొండిపూడి గ్రామానికి చెందిన లైెట్టి నీలాద్రి అలియాస్ ప్రకాశరావు ఇటీవల దారుణహత్యకు గురయ్యాడు. ఈ కేసులో మృతుని సోదరుడు కూర్మారావు అలియాస్ కుమార్‌పై అనుమానాలు వ్యక్తమయ్యాయి. హత్య జరిగిన వెంటనే కూర్మారావు పరారు కావడంతో అనుమానాలు బలపడ్డాయి. కాశీబుగ్గ రూరల్ సీఐ పి.ఈశ్వరరావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేశారు. అనంతరం కూర్మారావును సీఐ ఈశ్వరరావు అరెస్ట్ చేశారు. నిందితుడిని ఇచ్ఛాపురం కోర్టుకు తరలించగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారని, శ్రీకాకుళం జైలుకు తరలించామని సీఐ ఈశ్వరరావు సోమవారం చెప్పారు.

రెడ్‌క్రాస్‌లో సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్ పరికరం



ఎస్‌డీపీ ద్వారా రక్తదానం చేస్తున్న యువకుడు శంకర్

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సింగిల్ ప్లేట్‌లెట్స్(ఎస్‌డీపీ) పరికరం ప్రారంభించామని అందరూ సద్వినియోగం చేసుకోవాలని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. స్థానిక రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రంలో ఎస్‌డీపీ ద్వారా రక్తదానం కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 55 కిలోల బరువుతో ఉండి, 13 శాతం హిమోగ్లోబిన్ ఉండే ప్రతి ఒక్కరూ రక్తదానం చేయవచ్చని అన్నారు. వాతావరణ మార్పులతో డెంగీ, మలేరియా జ్వరాల బారిన పడి ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని, ఇందులో పసి పిల్లలు నుంచి పెద్దల వరకు ఉండడం బాధాకరమని అన్నారు. వీటి బారిన పడిన వ్యక్తులకు ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గుతోందన్నారు. ఈ రోజు జెమ్స్ వైద్య కళాశాలలో అత్యవసరంగా బి పాజిటివ్ ప్లేట్‌లెట్స్ అవసరం కాగా పాలకొండ, అంపిలికి చెందిన ఎ.శంకరరావు ఎస్‌డీపీ పరికరం ద్వారా రక్తదానం చేశారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో టెన్త్ విద్యార్థి మృతి



పాలక కల్యాణ్ (ఫైల్)

కొత్తూరు : మండలంలోని మహసింగి గ్రామం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పాలక కల్యాణ్(15) అనే పదో తరగతి విద్యార్థి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సీతంపేట మండలం కడగండి చెందిన కల్యాణ్ అదే గ్రామానికి చెందిన వి.మణికంత, భామిని మండలం లోహరిజోలకు చెందిన వంశీ ముగ్గురూ కలిసి ద్విచక్ర వాహనంపై సీతంపేట నుంచి కొత్తూరు వస్తుండగా.. మహసింగి సమీపంలో వీరి బండిని లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో కల్యాణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మిగతా ఇద్దరినీ రాగోలు జెమ్స్ ఆస్పత్రికి తరలించారు. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎంఏ అహ్మద్ తెలిపారు. ప్రమాదానికి గురైన వారు స్థానిక ఏకలవ్య పాఠశాలలో పదో తరగతి చదివారు. సీబీఎస్‌సీ కావడంతో టెన్త్ పరీక్షలు ముగించుకుని హాస్టల్ నుంచి రిలీవ్ అయిపోయారు. కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

● ఎంత వి'ఛత్రం'!



లక్షల విలువైన కారుపై తాటికమ్మల గొడుగును కట్టేసి ప్రయాణిస్తున్న దృశ్యం సోమవారం శ్రీకాకుళం జాతీయ రహదారిపై ఇలా కనిపించింది. ఎండలు మండిపోతున్న తరుణంలో ఈ దృశ్యం కనిపించడంతో వాహనదారులు ఆసక్తిగా గమనించారు. – అరసవల్లి